# విశాల భారతి

తెలుగు దినపత్రిక

4-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 33


## దేశాన్ని అమెరికాకు అమ్మేశారు

దేశ ప్రయోజనాలను ప్రధాని తాకట్టు పెట్టారని రాహుల్ ఆరోపణ

అదానీ కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ భయంతోనే రాజీపడ్డారని విమర్శ

లోక్‌సభలో ప్రతిపక్ష నేత ప్రసంగాన్ని అడ్డుకోవడంపై ఆగ్రహం

4 నెలలుగా ఆగిన వాణిజ్య ఒప్పందంపై హఠాత్తుగా సంతకం

పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల భారీ నిరసన ప్రదర్శన



**విశాలభారతి, జాతీయం:** అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై ప్రధాని అకస్మాత్తుగా సంతకం చేయడం వెనుక విదేశీ శక్తుల భయం దాగి ఉందని ఆయన విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ప్రధాని మోదీ తన వ్యక్తిగత ప్రతిష్టను కాపాడుకునేందుకు దేశ ప్రయోజనాలను, ముఖ్యంగా రైతుల శ్రమను అమెరికాకు ధారాదత్తం చేశారని మండిపడ్డారు. ఈ ఒప్పందం ద్వారా అన్నదాతల కష్టాన్ని, దేశ ఆర్థిక మూలాలను అమ్మేశారని, ఈ విషయాన్ని దేశ ప్రజలు, రైతులు లోతుగా అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికాలో పారిశ్రామికవేత్త అదానీపై ఉన్న కేసు వాస్తవానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సామ్రాజ్యాన్ని లక్ష్యంగా చేసుకున్నదేనని రాహుల్ గాంధీ విశ్లేషించారు. అదానీని టార్గెట్ చేయడం అంటే మోదీ ఆర్థిక నిర్మాణాన్ని దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దీనితో పాటు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్న 'ఎప్‌స్టీన్ ఫైల్స్' ప్రస్తావనను రాహుల్ తీసుకొచ్చారు. ఇంకా విడుదల కాని ఆ ఫైల్స్‌లో ఉన్న విషయాలు ప్రధానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని, ఆ భయం కారణంగానే అమెరికా

మిగతా 2లో..

## టైఫాయిడ్ గుప్పిట్లో తెలంగాణ

- దేశవ్యాప్త టైఫాయిడ్ మరణాల్లో తెలంగాణది 19 శాతం వాటా
- 2023లో రాష్ట్రంలో టైఫాయిడ్ బారినపడి 202 మంది మృతి
- అత్యధిక మరణాల్లో ఉత్తరప్రదేశ్ తర్వాత రెండో స్థానంలో తెలంగాణ
- జనాభా కేవలం 2.5 శాతమే ఉన్నా మరణాల్లో ఇంత భారీ వాటా ఆందోళనకరం
- కలుషిత ఆహారం, నీరు, పారిశుద్ధ్య లోపాలే ప్రధాన కారణమని వెల్లడి
- చికిత్సలో జాప్యం వల్ల పేగులకు రంధ్రాలు పడి ప్రాణాంతక పరిస్థితి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రాన్ని టైఫాయిడ్ మహమ్మారి వణికిస్తోంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న టైఫాయిడ్ మరణాల్లో తెలంగాణ వాటా అత్యధికంగా ఉండటం ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. దేశంలో సంభవిస్తున్న ప్రతి ఐదు టైఫాయిడ్ మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్' 2023 నివేదికలో వెల్లడైన ఈ గణాంకాలు రాష్ట్ర ఆరోగ్య యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేవలం 2023 సంవత్సరంలోనే రాష్ట్రంలో 202 మంది ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. మరణాల

మిగతా 2లో..

## పురపోరుకు సీఎం శంఖారావం



### మున్సిపల్ గెలుపుపై సీఎం రేవంత్ కీలక సమీక్ష

మంత్రులంతా క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశం

అసంతృప్త నేతలను బుజ్జగించాలని సూచన

ఈ నెల 11న మున్సిపల్, కార్పొరేషన్ పోలింగ్

ఓట్లు చీలకుండా చూడాలని నేతలకు స్పష్టీకరణ

నేడు మిర్యాలగూడ సభతో ఎన్నికల శంఖారావం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో జరగనున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో మంత్రులు, పార్టీ ముఖ్య నేతలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల గెలుపు అవకాశాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలపై లోతైన విశ్లేషణ చేశారు. మంత్రులందరూ తమకు కేటాయించిన బాధ్యతాయుతమైన జిల్లాలకు తక్షణమే వెళ్లాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి కరాఖండిగా చెప్పారు. పార్టీ అంతర్గత సర్వేల ఆధారంగా ఏయే మున్సిపాలిటీల్లో పార్టీ పరిస్థితి కాస్త బలహీనంగా ఉందో సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్కడ ఓటర్లను ఆకట్టుకునేలా వ్యూహాలు రచించాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా పర్యటనల వివరాలను, రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పీసీసీకి నివేదికలు అందించాలని ఆదేశించారు.

మిగతా 2లో..

## ఫిరాయింపుల వేడి

కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు

ఈరోజు విచారణకు రావాలని వెల్లడించారు

పిర్యాదుదారుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానందకూ పిలుపు

ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్

కడియం భవితవ్యంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయ యవనికపై అనర్హత వేటు అంశం మరోసారి పెను సంచలనంగా మారింది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో, ఫోన్ ట్యాపింగ్ వంటి కీలక కేసులు ఒకవైపు వేడి పుట్టిస్తుండగా, మరోవైపు ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం సమీకరణాలను వేగంగా మారుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ గూటికి చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న గులాబీ పార్టీ పోరాటం ఇప్పుడు క్లైమాక్స్ కు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, మిగిలిన ముగ్గురి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. తాజాగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయంలో స్పీకర్ కార్యాలయం దూకుడు పెంచింది. రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ నేతగా పేరున్న కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్ విచారణకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు తన ఎదుట హాజరు కావాలంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన కడియం, రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్న స్పీకర్, కడియంతో పాటు ఫిర్యాదుదారు వివేకానందను కూడా విచారణకు పిలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కారు గుర్తుపై భారీ మెజారిటీతో విజయం సాధించిన కడియం శ్రీహరి, ఆ తర్వాత మారిన పరిణామాలతో హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యంగా తన కుమార్తె కడియం కావ్య రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరడం ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని బీఆర్ఎస్ గట్టిగా వాదిస్తోంది.

మిగతా 3లో..

## జాబ్ క్యాలెండర్‌ను పాతరేశారు

- నిరుద్యోగుల గ్యారెంటీపై సీఎం మాట మార్చారని కేటీఆర్ విమర్శ
- ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్న
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలతో రేవంత్ ఫోజులు కొడుతున్నారని ధ్వజం
- రైతుబంధు ఎగ్గొట్టి అన్నదాతల పొట్టకొట్టారని మండిపాటు
- ఆరు గ్యారెంటీలు కేవలం గారడీలేనని ఎక్స్ వేదికగా పోస్ట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని, మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికి, తీరా గద్దెనెక్కిన తర్వాత ఇప్పుడు ఐదేళ్లలో భర్తీ చేస్తామంటూ మాట మార్చడం పచ్చి మోసమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ సుదీర్ఘ పోస్టు చేస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డదారులు తొక్కిన రేవంత్ రెడ్డి, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని కేటీఆర్ ఆరోపించారు. పీసీసీ చీఫ్‌తో ముఖ్యమంత్రి పలికిస్తున్న చిలుక పలుకులను తెలంగాణ సమాజం గమనిస్తోందని ఎద్దేవా చేశారు. గత కేసీఆర్ హయాంలో ప్రక్రియ పూర్తయ్యే దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి, ఆ ఘనత తనదే అన్నట్లుగా సీఎం ఫోటోలకు ఫోజులు కొట్టారని విమర్శించారు. ఆ తర్వాత కొత్తగా ఒక్క నోటిఫికేషన్ కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో తెలంగాణలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయిందని, రాష్ట్రం 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జాబ్ క్యాలెండర్‌కు పాతరేసిన ఈ ప్రభుత్వం, వరుస కుంభకోణాలతో జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో..



## హస్తం పార్టీలో 'మున్సిపల్' మంటలు

- జగిత్యాల కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- 30:20 నిష్పత్తిలో టికెట్ల కేటాయింపుపై రచ్చ
- ఎమ్మెల్యే సంజయ్ తీరుపై జీవన్ రెడ్డి వర్గం ఆగ్రహం
- టికెట్ దక్కలేదని మహిళా నేత కన్నీటి పర్యంతం
- రంగంలోకి దిగుతున్న పీసీసీ అధిష్టానం

03

## మున్సిపల్ సంగ్రామం

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు

ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణ

ఫిబ్రవరి 13న వెలువడనున్న ఫలితాలు

16న మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక

బరిలో నిలిచిన 52.43 లక్షల మంది ఓటర్లు

03






## కాంగ్రెస్ సింగరేణిని భ్రష్టు పట్టించింది

- కేంద్ర బడ్జెట్‌పై ద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు
- వికసిత్ భారత్-2047 లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన
- తెలంగాణకు పీఎం ఆవాస్ యోజన కింద 4.30 లక్షల ఇళ్లు
- ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహాల ఏర్పాటు
- హైదరాబాద్‌ను భారీ రైల్వే హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక
- సింగరేణి సంస్థను బీఆర్ఎస్, కాంగ్రెస్ భ్రష్టు పట్టించాయని విమర్శ

03

# పురపోరుకు సీఎం శంఖారావం

**మొదటిపేజీ తరువాయి**



మంత్రులు కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా, వార్డుల వారీగా స్థానిక నేతలతో భేటీ అవుతూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని సూచించారు. 90 శాతం స్థానాల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో టికెట్ల కేటాయింపు సహజంగానే కొందరిలో అసంతృప్తికి దారితీస్తుందని, అయితే మున్సిపల్ ఎన్నికల్లో ఆశపడి భంగపడ్డ నేతలను బుజ్జగించే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "పాత నేతలు, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు కలిసికట్టుగా పనిచేయాలి. మన మధ్య విభేదాలు ప్రత్యర్థులకు లాభం చేకూర్చకూడదు" అని ఆయన హితబోధ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రెబల్ అభ్యర్థులు బరిలో లేకుండా చూడాలని, వారు నామినేషన్లు ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నాయకత్వానిదేనని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించిన సీఎం, గెలుపు బాధ్యత పూర్తిగా ఆయా పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లదేనని తేల్చి చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇన్‌ఛార్జులంతా తమ స్థానాల్లోనే మకాం వేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తలెత్తే రాజకీయ సమస్యలు లేదా సమన్వయ లోపాలను తక్షణమే పీసీసీ చీఫ్ లేదా పార్టీ వార్ రూమ్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని, 80 శాతం మంది ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారని ధీమా వ్యక్తం చేస్తూనే, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మరోవైపు, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పాటు బీఫారాల పంపిణీ కూడా పూర్తి కావడంతో ప్రచార పర్వం ఊపందుకుంది. ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, అభ్యర్థులకు ప్రచారం కోసం కేవలం వారం రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. ఈ స్వల్ప కాలంలోనే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని సీఎం సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు ఓటర్లను ఆకట్టుకుంటాయని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలకు వివరించారు.

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రచార అస్త్రాలుగా మలుచుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించాలని కోరారు. వార్డుల వారీగా స్థానిక మేనిఫెస్టోలను రూపొందించి ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ఎవరైనా ఇన్‌ఛార్జ్‌లు లేదా మంత్రులు స్వయంగా సిఫార్సు చేసిన అభ్యర్థులు ఓడిపోతే, దానికి ఆ నేతలే బాధ్యత వహించాల్సి ఉంటుందని రేవంత్ రెడ్డి పరోక్షంగా హెచ్చరించారు. దీంతో నేతలందరూ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు.

ఈరోజు నుంచి ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి ప్రచారంలో పాల్గొననున్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పర్యటనతో ఆయన ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. అక్కడ ప్రతిష్టాత్మకమైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 5,000 కోట్లతో నిర్మిస్తున్న ఈ పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే తమ లక్ష్యమని ఆయన ఇదివరకే ప్రకటించారు. ఈ పర్యటనతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం రానుంది.

శంకుస్థాపన అనంతరం మిర్యాలగూడలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు కోట్లాది రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేయనున్నారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిచెప్పడంతో పాటు, మున్సిపల్ ఎన్నికల వ్యూహాలను ప్రజల ముందు ఉంచనున్నారు. ఈ సభ ద్వారా ప్రత్యర్థులకు గట్టి సందేశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. పార్టీ కేడర్ ఈ సభను విజయవంతం చేయడానికి భారీ ఏర్పాట్లు చేస్తోంది.

ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితర ముఖ్య నేతలు పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. బీసీ సామాజిక వర్గాలకు ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రిజర్వేషన్ల అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెస్తామని వారు చర్చించారు. టికెట్లు దక్కని సీనియర్ నేతలకు భవిష్యత్తులో కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీనివల్ల పార్టీలో అంతర్గత అసమ్మతి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తానికి, ఫిబ్రవరి 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ సెమీఫైనల్స్‌గా పరిగణిస్తోంది. గత రెండేళ్ల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండం అని కొందరు నేతలు చెబుతుండటంతో, రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా పనిచేస్తోంది. మున్సిపల్ గెలుపు ద్వారా రాష్ట్రంలో తమ పట్టును మరింత సుస్థిరం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీ ఎత్తుగడలను చిత్తు చేస్తూ మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడానికి పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతోంది.

## ప్రధానమంత్రి క్రీడల మహోత్సవానికి మంచి స్పందన



- గుండగోని భరత్ గౌడ్
- మేకల సారంగపాణి

**సికింద్రాబాద్, విశాలభారతి:** ప్రధానమంత్రి క్రీడల మహోత్సవం కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల మహోత్సవానికి మంచి స్పందన లభిస్తుందని, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం యువత మహిళలు క్రీడాకారులు అన్ని వర్గాల ప్రజలు క్రికెట్ వాలీబాల్ మ్యూజిక్ చైర్స్ కబడ్డీ 200 మీటర్స్ అండ్ 100 మీటర్స్ రన్స్ పోటీలకు మంచి స్పందన ఉందని భారతీయ జనతా పార్టీ మహంకాళి సికంద్రాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుండగోని భరత్, మేకల సారంగపాణిలు అన్నారు. కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి వారికి అన్ని విధాలుగా అండగా నిలబడుతున్నారని భరత్ అన్నారు. నేటి యువత క్రీడా భవిష్యత్తు కోసం భారతీయ జనతా పార్టీ వారికి తగిన శిక్షణ ప్రోత్సాహం ఇస్తుందని భరత్ గౌడ్ మేకల సారంగపాణి అన్నారు. వీరికి జాతీయ స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీలో గెలిచిన వారికి ఓడిపోయిన వారికి తగిన విధంగా ప్రోత్సహించి మంచి బహుమతులను అందజేస్తామని వారి ప్రతిఫలం గుర్తించి సర్టిఫికెట్స్ ఇస్తామని వారు అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్లో కిషన్ రెడ్డి నాయకత్వంలో ఎంతోమంది క్రీడాకారులను గుర్తించి వారికి అన్ని విధాలుగా అండగా నిలబడతామని భరత్ గౌడ్ మేకల సారంగపాణి అన్నారు. ఓయూ గ్రౌండ్లో గెలిచిన క్రీడాకారులకు, ఓడిపోయిన క్రీడాకారులకు బుధవారం బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, వెంకటేష్ గౌడ్, కృష్ణమూర్తి, నాగేశ్వర్ రెడ్డి, రవి ప్రసాద్ గౌడ్, కనకట్ల హరి, గణేష్, శ్రీనివాస్ చారి, వినయ్ కుమార్, అంబాల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, రాజు సాగర్, నరేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాన్ని అమెరికాకు అమ్మేశారు

**మొదటిపేజీ తరువాయి**



చెప్పినట్లు మోదీ నడుచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో ప్రధానిపై తీవ్రమైన ఒత్తిడి ఉందని, అందుకే ఆయన అమెరికాకు పూర్తిగా లొంగిపోయారని దుయ్యబట్టారు. సభలో తన గొంతు నొక్కడంపై రాహుల్ గాంధీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ప్రతిపక్ష నేతకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజలకు వాస్తవాలు తెలియకుండా ఉండేందుకే అధికార పక్షం తన ప్రసంగాన్ని అడ్డుకుందని ఆరోపించారు. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించుకున్న 'బలమైన నాయకుడు' అనే ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతోనే మోదీ ఈ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోవాల్సి వచ్చిందో, రాత్రికి రాత్రే ఒప్పందంపై ఎందుకు సంతకం చేయాల్సి వచ్చిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. మరోవైపు మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణె తన ఆత్మకథలో పేర్కొన్న అంశాలపై కూడా లోక్‌సభలో తీవ్ర చర్చ నడిచింది. ఈ అంశంపై మాట్లాడేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నించగా, ప్రభుత్వం అడ్డుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో స్పీకర్ సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. చివరకు సభ బుధవారానికి వాయిదా పడింది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. 'సరెండర్ మోదీ', 'ఎప్‌స్టీన్ మోదీ' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఈ ధర్నాలో కాంగ్రెస్ అగ్రనేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. మోదీ-ట్రంప్ బంధం వెనుక దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత భయాలే ఎక్కువగా ఉన్నాయని వారు నినదించారు. రైతుల ప్రయోజనాలను విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే వాణిజ్య ఒప్పందాలను తాము సహించబోమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని తన మౌనాన్ని వీడి, ఈ ఒప్పందంలో దాగి ఉన్న రహస్యాలను దేశానికి వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అదానీ కేసులో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు, అమెరికా నుంచి వస్తున్న ఒత్తిడి భారత్‌ను రక్షణ, వాణిజ్య రంగాల్లో బలహీనపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఈ తీవ్ర విమర్శలపై అధికార భారతీయ జనతా పార్టీ గట్టిగా స్పందించింది. మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రతిపక్షాలు దేశాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందం దేశ పురోగతికి మైలురాయి వంటిదని, దానిపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాలకు అనుకూలమో లేక వ్యతిరేకమో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదానీ, ఎప్‌స్టీన్ అంశాలను జోడించి రాహుల్ గాంధీ కల్పిత కథలు చెప్తున్నారని, సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ప్రస్తుతం పార్లమెంట్‌లో జరుగుతున్న ఈ పరిణామాలు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఒకవైపు కీలకమైన వాణిజ్య ఒప్పందం, మరోవైపు ప్రతిపక్ష నేత గొంతు నొక్కారన్న ఆరోపణలతో సభ దద్దరిల్లుతోంది. అమెరికా ఒత్తిడి ఉందన్న రాహుల్ గాంధీ వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా రైతుల సమస్యలను ఈ ఒప్పందంతో ముడిపెట్టడం ద్వారా గ్రామీణ భారతాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అదానీ వ్యవహారం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరడం, దానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ వంటి అంశాలను జోడించడం ద్వారా ప్రతిపక్షం ప్రభుత్వంపై ఒత్తిడిని మరింత పెంచింది. రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ విమర్శలేనా లేక అందులో వాస్తవాలు ఉన్నాయా అన్నది రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. అయితే, ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం మాత్రం ప్రజాస్వామ్యవాదులను కలవరపెడుతోంది. బుధవారం సభ ప్రారంభమైన తర్వాత కూడా ఈ అంశంపై రగడ కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం ఈ ఒప్పందంపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రాహుల్ గాంధీ హెచ్చరించారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# జాబ్ క్యాలెండర్‌ను పాతరేశారు

**మొదటిపేజీ తరువాయి**



తెలంగాణ యువతను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా ప్రజలు క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేవలం నిరుద్యోగులనే కాకుండా, రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు నిధులను ఎగ్గొట్టి, సుమారు 70 లక్షల మంది అన్నదాతల కడుపు కొట్టారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో, ధైర్యంగా బతికిన రైతన్నను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అప్పులపాలు చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తీరని ద్రోహం చేసిన ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సీటుపై కూర్చున్న మరుక్షణమే రాష్ట్రంలోని ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటయ్యి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క మహిళకు కూడా ఆ సొమ్ము అందలేదని మండిపడ్డారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అక్షరాలా గారడీలేనని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలన్నీ నయవంచనతో కూడుకున్నవేనని, రేవంత్ సర్కారు తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుందని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని, వారి ఆగ్రహజ్వాలల్లో ఈ ప్రభుత్వం భస్మం కాక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ యువత చైతన్యానికి ప్రతీక అని, వారు సంఘటితమైతే ఎంతటి బలమైన శక్తినైనా కూల్చగలరని పేర్కొన్నారు. త్వరలోనే నిరుద్యోగులు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో రేవంత్ రెడ్డి చూస్తారని కేటీఆర్ తన పోస్టులో హెచ్చరించారు.

రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి, కేవలం రాజకీయ విమర్శలు, కుంభకోణాలకే ప్రభుత్వం పరిమితమైందని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధి పనులను పక్కనపెట్టి, గత ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చడం లేదా వాటిని నిలిపివేయడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైన ఈ సర్కారుకు అధికారంలో కొనసాగే అర్హత లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపుతూనే, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వబోమని, ప్రతి నిరుద్యోగికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. తప్పుడు వాగ్దానాలతో ఓట్లు దండుకుని, ఇప్పుడు ముఖం చాటేస్తున్న నేతలకు రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని కేటీఆర్ ఘాటుగా స్పందించారు.

నిరుద్యోగుల ఆవేదనను రేవంత్ ప్రభుత్వం తేలికగా తీసుకుంటోందని, కానీ అదే వారి పతనానికి దారితీస్తుందని కేటీఆర్ విశ్లేషించారు. ఉపాధి లేక విలవిలలాడుతున్న యువతకు భరోసా ఇవ్వాల్సింది పోయి, వారిని హేళన చేసేలా ముఖ్యమంత్రి మాటలు ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ లోకం, ఇప్పుడు కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమానికి నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న రేవంత్ రెడ్డికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు.. ఇలా ప్రతి వర్గాన్ని కాంగ్రెస్ మోసం చేస్తూనే ఉందని కేటీఆర్ అన్నారు. ఈ మోసపూరిత పాలనపై ప్రజల్లో ఇప్పటికే స్పష్టమైన అభిప్రాయం ఏర్పడిందని, ఆరు గ్యారెంటీలను కేవలం అడ్డం పెట్టుకుని అధికారాన్ని అనుభవిస్తున్నారని విమర్శించారు. పారదర్శకత లేని పాలన, అస్తవ్యస్తమైన ఆర్థిక పరిస్థితితో రాష్ట్రం వెనుకబడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నయవంచనను ప్రతి ఇంటికి తీసుకెళ్తామని, ప్రజల పక్షాన తమ గళాన్ని మరింత వినిపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనదని, అబద్ధాలతో ఎంతో కాలం నెట్టుకురాలేరని కేటీఆర్ హితవు పలికారు. రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోకపోతే, నిరుద్యోగ యువత సెగ త్వరలోనే సచివాలయాన్ని తాకుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పునాదులు కదిలిపోయే రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారికి కాలమే సమాధానం చెబుతుందని కేటీఆర్ తన సందేశాన్ని ముగించారు.

## సింగరాజు పల్లి గ్రామంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలు

**దేవరుప్పుల, విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పుట్టినరోజు సందర్భంగా దేవరుప్పుల మండల సింగరాజుపల్లి గ్రామ కేంద్రంలోని సీతారామరాజు విగ్రహం వద్ద సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో కేకును కోసి మిఠాయిలు పంచుకొని ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే యశస్విని రెడ్డి గారు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యే గారి నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ముఖ్యంగా మహిళల సాధికారత, పేదల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి ఆమె చేసిన ఆదర్శప్రాయమని, దేవరుప్పుల మండల ప్రజల ఆశీర్వాదాలతో యశస్విని రెడ్డి గారు మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అటికం ఎల్లయ్య, ఉప సర్పంచ్ జోగు అనిల్, వార్డ్ మెంబర్ తాళ్లపల్లి, వేణు కొంగరి గ్రాములు, కొండ అఖిల్, నాయకులు నల్ల యాదగిరి, చిన్న మల్లారెడ్డి, శివారెడ్డి, తాళ్లపల్లి ఐలయ్య, జాటోత్ చంద్ర, మట్ట రాములు, అటికం నరసయ్య, చిన్న బుచ్చిరెడ్డి, రాపాక లక్ష్మణ్, మంగ సారయ్య, జోగు మల్లయ్య, జోగు వీరస్వామి, జోగు సోమరాజు రాపాక సంతోష్, మరియు యూత్ నాయకులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఖమ్మం జిల్లా డైరీ ఆవిష్కరణ



**ఖమ్మం, విశాలభారతి:** టీజీవోఎస్ జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మరియు మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో ఈ రోజు పలువురు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి వినతులు అందజేశారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్ రావు, కమిషనరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రకళ, మరియు సీఐ స్వామిలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు లేదా వినతులు సమర్పించారు. అనంతరం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతితో పాటు అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, వెంకన్న తదితరులను కూడా కలిశారు. ఈ కార్యక్రమ సందర్భాన్ని పురస్కరించుకుని టీజీవోఎస్ రాష్ట్ర అధ్యక్షులు మరియు టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు, నూతన పీఆర్సీ, హెల్త్ కార్డుల నిర్వహణ మరియు సీపీఎస్ రద్దు వంటి అంశాల పురోగతిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, జిల్లా కోశాధికారి సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ కోపరేటివ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి. విజయ్ కుమార్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# టైఫాయిడ్ గుప్పిట్లో తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**



సంఖ్యలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2023లో దేశవ్యాప్తంగా టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణాల వల్ల మొత్తం 1,075 మరణాలు సంభవించగా, అందులో 19 శాతం వాటా ఒక్క తెలంగాణదే కావడం గమనార్హం. అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ 377 మరణాలతో మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండో స్థానాన్ని ఆక్రమించింది. పంజాబ్ 118 మరణాలతో మూడో స్థానంలో, దేశ రాజధాని ఢిల్లీ 36 మరణాలతో నాలుగో స్థానంలో ఉన్నాయి. దేశ మొత్తం జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.5 శాతం మాత్రమే అయినప్పటికీ, టైఫాయిడ్ మరణాల్లో ఇంతటి భారీ శాతం నమోదవడంపై వైద్య నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధానంగా 'సాల్మొనెల్లా టైఫీ' అనే బ్యాక్టీరియా కారణమని వైద్యులు వివరిస్తున్నారు. ఈ బ్యాక్టీరియా ప్రధానంగా కలుషితమైన ఆహారం, నీటి ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. నగరాల్లోని పాత నీటి పైపులైన్ల ద్వారా సరఫరా అయ్యే నీరు, మురుగునీటి కాల్వలతో కలిసి కలుషితమవ్వడం ఈ వ్యాప్తికి ప్రధాన హేతువుగా కనిపిస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం, వేసవిలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. మరమ్మతుల సమయంలో పైపులైన్లలోకి చేరుతున్న మురుగునీటిని ప్రజలు తాగడం వల్ల సామూహికంగా టైఫాయిడ్ బారిన పడుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలుతోంది. పరిశుభ్రత పాటించని ప్రాంతాల్లో తయారయ్యే 'స్ట్రీట్ ఫుడ్' ఈ వ్యాధికి మరో ముఖ్య వనరుగా మారింది. రోడ్ల పక్కన విక్రయించే ఆహార పదార్థాల తయారీలో వాడే నీరు కలుషితమై ఉండటం, ఆహారంపై ఈగలు వాలడం వంటి కారణాలతో బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతోంది. నగరాల్లోని నాలాలు పొంగి ప్రవహించడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల కూడా సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వేగంగా విస్తరిస్తోంది. పారిశుద్ధ్య లోపాలున్న ప్రాంతాల్లో నివసించే వారు ఈ వ్యాధికి ఎక్కువగా ప్రభావితమవుతున్నారు.

టైఫాయిడ్‌ను ప్రాణాంతక వ్యాధిగా మార్చుతున్నది ప్రధానంగా ప్రజల్లో ఉన్న అశ్రద్ధ, అవగాహనా లోపమే. జ్వరం రాగానే దానిని ఒక సాధారణ ఆరోగ్య సమస్యగా భావించి సొంత వైద్యం చేసుకోవడం వల్ల పరిస్థితి విషమిస్తోంది. ఆసుపత్రికి వెళ్లకుండా మెడికల్ షాపుల్లో దొరికే మందులు వాడటం, సరైన యాంటీబయాటిక్స్ తీసుకోకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన సమయంలో చికిత్స అందకపోతే ఈ బ్యాక్టీరియా పేగులపై ప్రభావం చూపి రంధ్రాలు పడేలా చేస్తుందని, దీనివల్ల అంతర్గత రక్తస్రావం జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, సాధారణంగా వాడే యాంటీబయాటిక్స్‌కు ఈ బ్యాక్టీరియా లొంగకపోవడం. మందుల వాడకంలో క్రమశిక్షణ లేకపోవడం వల్ల బ్యాక్టీరియా నిరోధక శక్తిని పెంచుకుంటోంది. దీనివల్ల సాధారణ చికిత్సతో తగ్గాల్సిన జ్వరం, ప్రాణాంతకమైన రక్త ఇన్ఫెక్షన్లకు దారితీస్తోంది. శరీరంలోని ముఖ్యమైన అవయవాలు దెబ్బతినడం వల్లే అత్యధిక మరణాలు సంభవిస్తున్నట్లు వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. చికిత్సలో చేసే ప్రతి చిన్న జాప్యం మృత్యువుకు దారితీసే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. ప్రజలు నీటిని మరిగించి చల్లార్చుకుని తాగడం అత్యంత ఉత్తమమైన మార్గమని చెబుతున్నారు. ఆహారం ఎప్పుడూ వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని, బయటి ఆహారానికి వీలైనంత దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుద్ధతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ బ్యాక్టీరియా వ్యాప్తిని అడ్డుకోవచ్చు. చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్నపాటి అలవాట్లు కూడా టైఫాయిడ్ నివారణలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ యంత్రాంగం కూడా తక్షణమే మేల్కొని పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఏయే ప్రాంతాల్లో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయో గుర్తించి, వాటిని 'హాట్‌స్పాట్'లుగా ప్రకటించాలి. ఆయా ప్రాంతాల్లో నీటి నాణ్యతను నిరంతరం పరీక్షించడం, మురుగునీరు తాగునీటిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం. అలాగే ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిర్వహించి, జ్వరం రాగానే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించేలా ప్రోత్సహించాలి.

మరణాల శాతాన్ని తగ్గించాలంటే సకాలంలో వ్యాధిని గుర్తించడం ఒక్కటే మార్గం. జ్వరం మూడు రోజుల కంటే ఎక్కువ ఉన్నా, తీవ్రమైన తలనొప్పి, కడుపునొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపించినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలను మరింత వేగవంతం చేయాలి. రోగి పరిస్థితిని బట్టి తగిన మోతాదులో యాంటీబయాటిక్స్ అందిస్తూ పర్యవేక్షించడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదిక తెలంగాణ రాష్ట్రానికి ఒక హెచ్చరిక వంటిది. కేవలం చికిత్స మాత్రమే కాకుండా, వ్యాధి నివారణపై దృష్టి సారించడం ద్వారానే ఈ మరణాల సంఖ్యను నియంత్రించగలం. శుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యం, సకాలంలో సరైన చికిత్స అనే మూడు సూత్రాలను పాటించడం ద్వారా టైఫాయిడ్ మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపై, ఇటు ప్రజలపై ఉంది. లేనిపక్షంలో ఈ మరణాల శాతం భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది.



## నేను కూడా తెలంగాణ జాతిపితనే



**విశాలభారతి, నల్గొండ:**

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను సిట్ అధికారులు విచారణ చేయడం పట్ల ఆ పార్టీ తీవ్రంగా మండిపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన మహానేతను అవమానిస్తున్నారంటూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గులాబీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ జాతిపిత అంటూ బీఆర్ఎస్ నేతలు కొనియాడుతుండగా.. కాంగ్రెస్ నేతలు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలకు తెరతీశారు. కేసీఆర్ జాతిపిత అయితే.. తాను కూడా తెలంగాణ జాతిపితనే అంటూ వ్యాఖ్యానించారు. నల్గొండలో మంగళవారం పర్యటించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులే నిజమైన జాతిపితలు అని కొనియాడారు. సోనియా గాంధీ తెలంగాణ దేవత అని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అయితే.. తానూ జాతిపితనే అని అన్నారు. తెలంగాణ కోసం తన సొంత పార్టీ కాంగ్రెస్‌ను కూడా ఎదిరించానని చెప్పిన కోమటిరెడ్డి.. తనకు వచ్చిన పదవులకు రాజీనామాలు చేసి సర్వస్వం కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ గానీ.. కోమటిరెడ్డి గానీ ఎన్నటికీ తెలంగాణ జాతిపితలు కాలేరని వ్యాఖ్యానించారు. మరోవైపు.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకికు ఘోర పరాభవం తప్పదని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికల్లో జరిగిందే మళ్లీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం కాబోతోందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనిపించకుండా పోవడం ఖాయమని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని 5 కార్పొరేషన్లు, 90 మున్సిపాలిటీలను తమ పార్టీ కైవసం చేసుకుంటుందని.. నల్లగొండ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే నల్గొండ నియోజకవర్గంలో 1000 మంది పేదలకు ఇళ్లు కట్టించామని.. అప్లై చేసుకున్న వెంటనే.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతోందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అందించే సన్నబియ్యాన్ని పేదలు ఇష్టంగా తింటున్నారని వెల్లడించారు.

## హస్తం పార్టీలో 'మున్సిపల్' మంటలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల కేటాయింపు వ్యవహారం అధికార పార్టీలో ముసలాన్ని పుట్టించింది. పార్టీలోని ఇద్దరు అగ్రనేతలు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గాల మధ్య ఉన్న విభేదాలు ఈ ఎన్నికల సాక్షిగా బహిర్గతమయ్యాయి. మున్సిపాలిటీలోని మొత్తం 50 వార్డులకు సంబంధించి జరిగిన సీట్ల పంపిణీలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని జీవన్ రెడ్డి అనుచరులు బాహాటంగానే ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. సీట్ల పంపకంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి 30 సీట్లు, సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కేవలం 20 సీట్లు కేటాయించడం ఈ గొడవకు ప్రధాన కారణమైంది. దశాబ్దాలుగా పార్టీ జెండా మోసిన తమను కాదని, ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి వర్గీయులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో సంజయ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేయడం, సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న జగిత్యాల కాంగ్రెస్‌లో ఇలాంటి బూతు పురాణాలు చోటుచేసుకోవడం కార్యకర్తలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ పరిణామాలపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీని నమ్ముకుని క్షేత్రస్థాయిలో కష్టపడే కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంటే తాను చూస్తూ ఊరుకోబోనని ఆయన హెచ్చరించారు. పార్టీలో క్రమశిక్షణ లోపించడం బాధాకరమని, పైరవీకారులకు టికెట్లు ఇస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో ఎవరికి ఓటు వేయాలో కూడా తెలియని అయోమయ స్థితి నెలకొందని ఆయన వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తన అనుచరులకు సరైన గుర్తింపు దక్కని పక్షంలో తదుపరి కార్యాచరణ ఉంటుందనే సంకేతాలను





ఆయన అధిష్టానానికి పంపారు.

మరోవైపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం ఈ ఆరోపణలను పూర్తిగా త్రోసిపుచ్చుతోంది. కేవలం గెలుపు గుర్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని టికెట్లు కేటాయించామని వారు వాదిస్తున్నారు. పార్టీ నిర్వహించిన రహస్య సర్వేల నివేదికల ఆధారంగానే 30 సీట్ల కేటాయింపు జరిగిందని, ఇందులో ఎలాంటి వ్యక్తిగత విద్వేషాలు లేవని వారు చెబుతున్నారు. అందరినీ కలుపుకుని పోవాలనేదే తమ ఉద్దేశమని, మున్సిపాలిటీలో పట్టున్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంలో తప్పులేదని ఎమ్మెల్యే అనుచరులు కౌంటర్ ఇస్తున్నారు. అయితే గ్రౌండ్ లెవల్లో మాత్రం ఆశావహుల నిరసనలు మిన్నంటుతున్నాయి.

టికెట్ల కేటాయింపులో జరిగిన పక్షపాతంపై ఒక మహిళా నేత కన్నీరు పెట్టుకోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు హరిత తనకు టికెట్ ఇస్తానని చెప్పి చివరి నిమిషంలో మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న రాత్రి వరకు భరోసా ఇచ్చి, ఇవాళ జాబితాలో పేరు లేదని చెప్పడంపై ఆమె తీవ్రంగా విలపించారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన తనకు ఇలాంటి అవమానం జరుగుతుందని ఊహించలేదని ఆమె పేర్కొన్న వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇలాంటి ఘటనలు సాధారణ కార్యకర్తల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని సడలిస్తున్నాయి.

మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి జగిత్యాల పరిణామాలు తలనొప్పిగా మారాయి. ఇద్దరు నేతల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూరుతుందని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఈ అంతర్గత పోరు వల్ల సామాన్య ఓటర్లలో కూడా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గ్రూపు రాజకీయాల వల్ల అభ్యర్థుల గెలుపు అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తక్షణమే అధిష్టానం జోక్యం చేసుకోవాలని జిల్లా నాయకులు కోరుతున్నారు. ఈ రచ్చ హైకమాండ్ దృష్టికి చేరడంతో పీసీసీ నాయకత్వం అప్రమత్తమైంది. జగిత్యాలలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రత్యేక దూతలను పంపాలని రాష్ట్ర కార్యాలయం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇద్దరు నాయకులను కూర్చోబెట్టి సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. నామినేషన్ల గడువు దగ్గర పడుతుండటంతో వీలైనంత త్వరగా ఈ వివాదాన్ని సర్దుమణిగేలా చేయాలని అధిష్టానం భావిస్తోంది. లేనిపక్షంలో రెబెల్స్ బరిలోకి దిగే ప్రమాదం ఉందని, అది పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. జగిత్యాల రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ఒక ప్రత్యేక ముద్ర. కానీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాకతో సమీకరణాలు మారిపోయాయి. పాత కొత్త కలయికలో భాగంగా తలెత్తుతున్న ఈ విభేదాలు చివరకు ఎక్కడికి దారితీస్తాయోనని జిల్లా ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. పార్టీలో సీనియారిటీకి విలువిస్తారా లేక గెలుపు అవకాశాలనే ప్రాతిపదికగా తీసుకుంటారా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే నిరసనలతో హోరెత్తుతున్న పార్టీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. అభ్యర్థుల ఎంపికలో మార్పులు ఉంటాయా లేక పాత జాబితాకే కట్టుబడి ఉంటారా అన్నది సస్పెన్స్‌గా మారింది.

క్షేత్రస్థాయిలో కార్యకర్తలు మాత్రం అయోమయంలో ఉన్నారు. ఇద్దరు నాయకులు పంతాలకు పోతే ఎన్నికల్లో గెలుపు కష్టమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కేడర్ రెండుగా చీలిపోవడం వల్ల ఓట్ల చీలిక జరిగి ప్రత్యర్థులకు మేలు జరుగుతుందనే భయం వెంటాడుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం పార్టీ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తోంది. ఈ క్రమంలో వివాదాస్పదమైన వార్డుల్లో అభ్యర్థులను మార్చడం ద్వారా అసంతృప్తిని చల్లార్చవచ్చని కొందరు సీనియర్లు సూచిస్తున్నారు.

మొత్తానికి జగిత్యాల కాంగ్రెస్ మున్సిపల్ పంచాయతీ ఇప్పుడు రాష్ట్ర స్థాయి చర్చగా మారింది. అధిష్టానం జోక్యంతోనైనా ఇక్కడ శాంతి నెలకొంటుందో లేక ఈ విభేదాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయో చూడాలి. నామినేషన్ల ఉపసంహరణ లోపు అందరినీ దారిలోకి తెచ్చుకోవడం పీసీసీకి సవాలుగా మారింది. ఏదేమైనా అధికార పార్టీలో ఈ స్థాయి వర్గపోరు జరగడం జగిత్యాల రాజకీయ చరిత్రలో ఒక కీలక మలుపుగా చెప్పవచ్చు. నాయకుల మధ్య పోరు సామాన్య కార్యకర్తల కన్నీటికి కారణం కాకూడదని స్థానిక ఓటర్లు కోరుకుంటున్నారు.

## కాంగ్రెస్ సింగరేణిని భ్రష్టు పట్టించింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రజలు ఎంతో కాలంగా ఆశిస్తున్న సుస్థిరమైన అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ బడ్జెట్ కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించింది కాదని, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలనే 'వికసిత్ భారత్' సంకల్పంతో ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు ఇందులో ఉన్నాయని ఆయన కొనియాడారు. కేవలం ఓట్ల రాజకీయాల కోసం కాకుండా, దేశ పురోభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు బడ్జెట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఉచిత పథకాల కోసమే బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా వీబీ జీ రామ్ జీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందంటూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఈ పథకానికి గతంతో పోలిస్తే బడ్జెట్‌లో 9 శాతం అదనంగా నిధులు కేటాయించారని, ఇది పథకం పట్ల కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందని ఆయన వివరించారు. ప్రతిపక్షాలు వాస్తవాలను దాచిపెట్టి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. మహిళా సాధికారత , విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి కేంద్రం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. దేశంలోని ప్రతి జిల్లాలో బాలికల కోసం ప్రత్యేక వసతి గృహాలను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ఉన్నత విద్య సులభతరమవుతుందని అభిప్రాయపడ్డారు. విద్యతో పాటు వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు కూడా ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారని, దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా స్థానిక పరిశ్రమలు బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కుటీర పరిశ్రమల నుంచి భారీ పరిశ్రమల వరకు అందరికీ మేలు చేకూరేలా ప్రోత్సాహకాలు ఉన్నాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం ఎప్పుడూ ముందుంటుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు



ఏకంగా 4.30 లక్షల ఇళ్లను కేటాయించినట్లు ప్రకటించారు. పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఈ కేటాయింపులు జరిగాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే ఈ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయి అర్హులకు అందుతాయని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా హైదరాబాద్ నగరాన్ని ఒక భారీ రైల్వే హబ్‌గా మార్చబోతున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. దీనివల్ల రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా నగర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలోని సాంస్కృతిక , ఆధ్యాత్మిక వేడుకలకు కేంద్రం అందిస్తున్న మద్దతును ఆయన గుర్తు చేశారు. మేడారం జాతర నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం 3.70 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. గిరిజన సంస్కృతిని గౌరవిస్తూ వారి పండుగలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా ఆ ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని, దీనివల్ల పర్యాటక రంగం ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి సంస్థను రాజకీయ స్వార్థం కోసం వాడుకున్నారని కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చుకుని అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని, ఆ సంస్థను కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల దగా వల్లే ఒకప్పుడు లాభాల్లో ఉన్న సింగరేణి నేడు భ్రష్టు పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాలను పక్కన పెట్టి నాయకులు తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ తీరును ఆయన తప్పుబట్టారు. ఈ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయి విమర్శలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. పాలనపై దృష్టి పెట్టకుండా అంతర్గత విభేదాలతో కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి సంస్థను కాపాడటం కంటే సొంత ప్రయోజనాలకే వారు ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. బొగ్గు గనుల కేటాయింపులు మరియు నిర్వహణలో పారదర్శకత లోపించిందని, దీనివల్ల రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం గండి పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని ఆయన విమర్శించారు.

తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కిషన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. రైల్వే, రహదారులు, ఐటీ వంటి రంగాల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయని చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశ పనులు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని, వీటి ఫలితాలు త్వరలోనే ప్రజలకు అందుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పనిచేస్తే మరిన్ని అద్భుతమైన ఫలితాలు వస్తాయని, కానీ అనవసర రాజకీయ విమర్శలతో రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. బడ్జెట్ అనేది ఒక రాజకీయ పత్రం కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచి అని కేంద్రమంత్రి అభివర్ణించారు. మధ్యతరగతి ప్రజలకు, రైతులకు, యువతకు ఈ బడ్జెట్ భరోసానిస్తుందని చెప్పారు. పన్నుల విధానంలో మార్పులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తాయన్నారు. ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతుంటే, భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటానికి మోదీ ప్రభుత్వ క్రమశిక్షణతో కూడిన ఆర్థిక విధానాలే కారణమని విశ్లేషించారు. భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఫిరాయింపుల వేడి

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు వివేకానంద తన ఫిర్యాదులో కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువా కప్పుకున్న దృశ్యాలను, వార్తా పత్రికల క్లిప్పింగులను ఆధారాలుగా సమర్పించినట్లు సమాచారం. బుధవారం జరగబోయే ఈ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎమ్మెల్యే వివేకానంద తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్ ముందు ప్రదర్శించనుండగా, కడియం శ్రీహరి తన వైపు నుంచి ఎలాంటి వివరణ ఇస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ తరహా కేసుల్లో ఏడుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ ఉపశమనం కలిగించారు. వారు అధికారికంగా కాంగ్రెస్ లో చేరలేదని, కేవలం మర్యాదపూర్వకంగానే కలిశారని లేదా వారు ఇంకా బీఆర్ఎస్ లోనే కొనసాగుతున్నారని స్పీకర్ గతంలో స్పష్టం చేశారు. అయితే కడియం శ్రీహరి విషయంలో బహిరంగంగానే పార్టీ మార్పు జరిగినట్లు ప్రచారం ఉన్నందున, స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు దానం నాగేందర్, సంజయ్ కుమార్ లపై ఉన్న పిటిషన్లు కూడా విచారణ దశలోనే ఉన్నాయి. దానం నాగేందర్ ఇప్పటికే లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలవ్వడం, ఆయనపై ఉన్న సాంకేతిక అంశాలు స్పీకర్ పరిశీలనలో ఉన్నాయి. ఈ క్రమంలో కడియం శ్రీహరి కేసును స్పీకర్ అత్యంత వేగంగా ముందుకు తీసుకువెళ్లడం గమనార్హం. ఒకవేళ స్పీకర్ కడియం శ్రీహరి వివరణతో సంతృప్తి చెందకపోతే, ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉందా లేదా అనేది సస్పెన్స్ గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఆచి తూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ వ్యవహారంలో వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించే వరకు చట్టపరమైన పోరాటం చేస్తామని గులాబీ నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే హైకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. న్యాయస్థానం విధించిన గడువులోగా ఈ పిటిషన్లపై ఒక స్పష్టత ఇవ్వాల్సి ఉండటంతో స్పీకర్ కార్యాలయం వరుసగా నోటీసులు జారీ చేస్తోంది. ఇదిలా ఉంటే,



కడియం శ్రీహరి వర్గం మాత్రం తాము ఎలాంటి నిబంధనల ఉల్లంఘన చేయలేదని, చట్టప్రకారమే తమ వాదనలు వినిపిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది.

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలవుతున్న తరుణంలో ఈ అనర్హత వేటు అంశం ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరం. ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రజలు స్వాగతిస్తున్నారా లేదా అన్నది చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కడియంపై వేటు పడితే స్టేషన్ ఘన్‌పూర్ లో ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంటుంది. ఇది అటు కాంగ్రెస్ కు, ఇటు బీఆర్ఎస్ కు ప్రతిష్టాత్మకమైన సవాలుగా మారుతుంది. అందుకే ఈ బుధవారం నాటి విచారణపై రాష్ట్రవ్యాప్తంగా అందరి కళ్లు నెలకొన్నాయి. మొత్తానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తీసుకోబోయే నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలికేలా ఉంది. ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చినట్లే కడియంకు కూడా ఊరట లభిస్తుందా లేక అనర్హత వేటు పడి పదవి కోల్పోతారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ స్పీకర్ నిర్ణయం బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా వస్తే వారు మళ్ళీ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ రాజకీయ చదరంగంలో ఎవరి ఎత్తుగడలు పారుతాయో చూడాలి.

ఈ కీలక పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం మరియు అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతను కూడా పటిష్టం చేశారు. రాజకీయ వేడి రాజుకున్న నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కడియం శ్రీహరి ఇచ్చే వివరణ, వివేకానంద చూపే ఆధారాలే ఈ కేసు గమనాన్ని నిర్ణయించనున్నాయి. వచ్చే 24 గంటలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనున్నాయి. వరుస పరిణామాలను గమనిస్తే, ఫిరాయింపుల నిరోధక చట్టం అమలుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ తో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసులను ఒక్కొక్కటిగా పరిష్కరించడం ద్వారా న్యాయపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏది ఏమైనా, బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ విచారణ ఫలితం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయనుంది.

## మున్సిపల్ సంగ్రామం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం మంగళవారంతో ముగిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులకు తమ నామినేషన్లను వెనక్కి తీసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించడంతో, బరిలో మిగిలిన అభ్యర్థులెవరో తేలిపోయింది. దీంతో ఇక క్షేత్రస్థాయిలో ప్రచారం హోరెత్తనుంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఓటర్ల నాడిని పట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి.మఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. సాంకేతిక కారణాల దృష్ట్యా ఈసారి కూడా బ్యాలెట్ పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఒకవేళ ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా లేదా సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా, అటువంటి ప్రాంతాల్లో ఫిబ్రవరి 12న రీపోలింగ్ నిర్వహించేలా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీంతో పోలింగ్ ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అత్యంత ఉత్కంఠ భరితంగా సాగే ఈ ఎన్నికల ఫలితాలను ఫిబ్రవరి 13న ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే విజేతలను ప్రకటిస్తారు. ఆ తర్వాత అసలైన రాజకీయం మున్సిపల్ చైర్‌పర్సన్, మేయర్ పదవుల ఎంపిక వద్ద మొదలవుతుంది. ఫిబ్రవరి 16న ఎన్నికైన వార్డు సభ్యులు, కార్పొరేటర్ల




ద్వారా పరోక్ష పద్ధతిలో 116 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లను ఎన్నుకుంటారు. అలాగే 7 కార్పొరేషన్లకు మేయర్లను, డిప్యూటీ మేయర్లను అదే రోజు ఎన్నుకోవడం ద్వారా ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగియనుంది.మఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సుమారు 52,43,000 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఓటరు జాబితాలో పేర్ల తనిఖీ నుంచి పోలింగ్ కేంద్రాల గుర్తింపు వరకు ప్రతి అంశంలోనూ పారదర్శకత పాటిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. డిజిటల్ మాధ్యమాల ద్వారా కూడా ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈసీ అధికారులు వెల్లడించారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భద్రతా ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు బలగాలను మోహరించనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిఘా కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రిటర్నింగ్ అధికారులకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ మున్సిపల్ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న కీలక ఎన్నికలు కావడంతో, తమ పట్టు నిరూపించుకోవాలని ప్రతి పార్టీ భావిస్తోంది. అధికార పార్టీ తన సంక్షేమ పథకాలను నమ్ముకోగా, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్తున్నాయి. పట్టణ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది ఇప్పుడు రాజకీయ విశ్లేషకుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రతి వార్డులోనూ అభ్యర్థుల గెలుపు గుర్రాల కోసం పార్టీలు తీవ్రంగా శ్రమించాయి.

ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి. ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలే ప్రధాన అజెండాగా ప్రచారం సాగుతోంది. స్థానిక సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రజాప్రతినిధులకు ఈసారి ఓటర్లు తగిన గుణపాఠం చెబుతారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు పార్టీల రెబల్ అభ్యర్థుల బెడద కూడా ప్రధాన పార్టీలను కలవరపెడుతోంది. నామినేషన్ల ఉపసంహరణ సమయంలో బుజ్జగింపులు ఫలించని చోట త్రిముఖ పోటీ తప్పనిసరిగా కనిపిస్తోంది.

## రోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** గండిపేట్ మండల్ పరిధిలోని 123వ జీహెచ్ఎంసీ డివిజన్ హైదర్షాకోట్ గ్రామం సాయి హర్ష కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరవనీయులు శాసనసభ సభ్యులు టి. ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి నేతృత్వంలో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యేను కలిసి, సాయి హర్ష కాలనీలో రోడ్లు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ప్రతి ప్రాంతంలో రోడ్లు వేయించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సాయి హర్ష కాలనీలో రోడ్లను అతి త్వరలోనే వేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబి రాక సందర్భంగా ర్యాలీ



**సికింద్రాబాద్, విశాలభారతి:** బిజెపి జాతీయ అధ్యక్షులు గా నియమితులైన నితిన్ నబీ నేడు బుధవారం ఉదయం ఢిల్లీ నుండి హైదరాబాద్ కు మొదటిసారిగా వస్తున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్ అధ్యక్షతన బౌద్ధ నగర్ డివిజన్ నుండి శంషాబాద్ విమానాశ్రయము వద్ద స్వాగతం పలుకుటకు ర్యాలీ కొరకు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. అతిథిగా బిజెపి నాయకులు టోపీ శంకర్ పాల్గొని డివిజన్ నుండి బూతు వారీగా 200 మంది కార్యకర్తలను శంషాబాద్ విమానాశ్రయం కి తీసుకురావాలని, అంతేకాకుండా 20 కారు ల లో కూడా కార్యకర్తలకు స్వాగత వేదిక వద్దకు చేరుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రవి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నేతి సత్యనారాయణ. కుమార్. చైతన్య. సంపత్, సుశీల తదితర కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## రామగుండం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 7(1), 2016, యాక్ట్ 22(1)(a) నుండి (f), 22(2)(a) & (b), 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 నం. IX ఫసలీ, సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం 01022026 ఉదయం 6:00 గంటల నుండి 01032026 ఉదయం 6:00 గంటల వరకు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ కాలంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు,సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.ఈ తరహా కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బందల పేరిట వివిధ కారణాలు చూపుతూ సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించేందుకు ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## బి ఫామ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నియోజకవర్గం అంజనాద్రి గుట్టపై ఉన్న శ్రీ ధనుర్బాణ రామాంజనేయ స్వామి ఆలయంలో మరియు సప్తగిరి కాలనీ లోని శివాలయంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్ అభ్యర్థుల 'బి' ఫారమ్‌లకు మంగళవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్,ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి స్వామివారి ఆశీస్సులు కోరారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచి రామగుండం నగర అభివృద్ధికి కృషి చేయాలని రాజ్ ఠాకూర్ దంపతులు ఆకాంక్షించారు.

## ప్రధానోపాధ్యాయులకు రిప్రెసెంటేషన్



**విశాలభారతి, కరకగూడెం:** మండల చిర్రమల్ల గ్రామపంచాయతీ పరిధిలోగల స్కూల్స్ పోలకమ్మతోగు స్కూల్ ,చిరుమళ్ళ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, రాయనపేట స్కూల్, కౌలూరు స్కూల్ లను సర్పంచ్ కొమరం సుగుణ ఆధ్వర్యంలో విజిట్ చేయడం జరిగింది. దీనిలో భాగంగా పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచే కొన్ని అంశాలైన నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యార్థుల గైర్హాజరుపై నిఘ వంటి అంశాలపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రిప్రెసెంటేషన్ ఇవ్వడం జరిగింది .ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ బాబురావు ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం, సీతారాంపురం గ్రామంలోని అనాధవృద్ధ శరణాలయంలో దేవరుప్పుల మండల ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.ఈ సందర్భంగా కేకును కోసి వృద్ధులకు పండ్లు,మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వరకల రతన్,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,ఎండి రసూల్, భూక్యా సజ్జన్, మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,రాంబోజి గూడెం సర్పంచ్ పరిధుల భాస్కర్, మాజీ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్,రెడ్డి రాజుల రమేష్, తీగల వెంకన్న, గుగులోత్ నరేందర్,యూత్ సోషల్ మీడియా పాలకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ లోడంగి అశోక్,మొగుల్లా హరీష్,వార్డ్ నెంబర్ బాష్పాక కుమార్,సోమన్న, పులిగిల్ల అఖిల్,ఆకుల సంతోష్,చింత ఉపేందర్,బానోత్ వెంకన్న,మాసంపల్లి సాత్విక్,కలకుంట్ల సాయి నేత,తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. పది పరీక్షల్లో ప్రతిభను చాటితే బిగ్ స్క్రీన్ పై టి.20 వరల్డ్ కప్ లైవ్ మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేయిస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న, వసతి గృహాల నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



- నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు సిఐటియు సమ్మె నోటీసు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు (CITU) ఆధ్వర్యంలో నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి కి సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎర్పుల నరసింహ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఈ కోడ్‌ల ద్వారా కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేయడం, కనీస వేతనాలు అడగలేని పరిస్థితిని కల్పించడం, యాజమాన్యం చెప్పిందే చట్టంగా మారేలా చేయడం జరుగుతోందన్నారు.

కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మార్చి, కార్మికులను రోడ్డున పడేసే విధంగా ఈ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని ఆరోపించారు. కావున వెంటనే ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జిహెచ్ఎంసి పరిధిలో మున్సిపాలిటీలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటికీ పర్మినెంట్ ఉద్యోగాలు లేవని, కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని తెలిపారు. వారందరూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గానే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎర్పుల నరసింహ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కార్మిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలు




**దేవరుప్పుల విశాలభారతి:** పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేకును కోసి మిఠాయిలు పంచుకొని ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే యశస్విని రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ,ఎమ్మెల్యే నాయకత్వంలో పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని,ముఖ్యంగా మహిళల సాధికారత,పేదల సంక్షేమం,గ్రామీణ అభివృద్ధికి ఆమె చేసిన ఆదర్శప్రాయమని,దేవరుప్పుల మండల ప్రజల ఆశీర్వాదాలతో యశస్విని రెడ్డి మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, మండల ఎస్సి,ఎస్టీ,బిసి,సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్,మహ్మద్ రసూల్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బోనగిరి యాకస్వామి, రెడ్డిరాజుల రమేష్,జక్కుల గంగరాజు,చింత చంద్రయ్య,పారుపెల్లి శ్రీనివాస్,ఆయా గ్రామాల సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

- రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- పట్నం మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** అబద్ధాల కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికలలో తగు రీతిలో బుద్ధి చెప్పాలని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 23 వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నీలం శ్వేతకు మద్దతుగా జరిగిన ఇంటింటి ప్రచారంలో ఆయన పార్టీ పరిశీలకురాలు పద్మావతీ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఓటు వేసేముందు గత శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి రెండేళ్లు దాటినా కనీసం ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. విద్యార్థులకు ఐదు లక్షల విద్యాభరోసా కార్డు , నెలకు నాలుగు వేల నిరుద్యోగ భృతి , విద్యార్థినులకు స్కూటీలు , పది నుండి పీజీ వరకు తరగతుల వారీగా పాసయిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం తదితర హామీలిచ్చి కనీసం ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 2500 రూపాయలు , పెళ్లిళ్లకు కేసీఆర్ కళ్యాణలక్ష్మితోపాటు తులం బంగారం , ఇరవై లక్షల వడ్డీ లేని రుణాలు అని చెప్పి మోసం చేశారని అన్నారు. వృద్ధులు , వితంతువులు , ఒంటరి మహిళలు , దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు నెలకు నాలుగు వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని గుర్తు చేశారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ సగం మందికి ఎగ్గొట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎద్దేవా చేశారు. కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీకి కనువిప్పు కలుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , మాజీ జెడ్పీటీసీ కర్నాటి రమేష్ గౌడ్ , బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితి

- బీఫామ్ సమర్పణలో హైడ్రామా
- ఆఖరి క్షణంలో బిఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్‌లోకి జంప్



**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీలో బీఫామ్ ల సమర్పణ సమయంలో అనూహ్య పరిమాణం చోటు చేసుకుంది. 17వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థిగా భావించిన చింతల ఉమామహేశ్వరి ఆఖరి నిమిషంలో కాంగ్రెస్ పార్టీలో చేరి,ఆ పార్టీ తరపున బీఫామ్ సమర్పించడం రాజకీయంగా కలకలం రేపింది.ఇంతకుముందు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పస్తం మల్లమ్మను తప్పించడంతోపాటు, ఉమామహేశ్వరికి కాంగ్రెస్ బీఫామ్ కేటాయించినట్లు తెలుస్తోంది.ఈ పరిణామంపై బిఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.తమ పార్టీ నేతలను ప్రలోభాలకు గురిచేశారంటూ కాంగ్రెస్ నేతలతో వాగ్వాదానికి దిగారు.ఇరు పార్టీల నేతల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు రంగంలోకి దిగి జోక్యం చేసుకున్నారు.

## కొయ్యలగూడెం విద్యార్థిని ప్రతిభ



**చౌటుప్పల్, విశాలభారతి:** యాదాద్రి జిల్లా స్థాయిలో సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ లో చౌటుప్పల్ మండల్ కొయ్యలగూడెం గ్రామం జడ్పిహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థిని టి.భవ్య ప్రథమ స్థానంలో గెలుచుపొంది ప్రతిభను చాటుకొని రాష్ట్ర స్థాయిలో ఎంపికైయారని చెప్పారు. కొయ్యలగూడెం పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుల బృందం ఎంతగానో విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికీ ఎన్నో రకాలుగా పోత్సాహం అందుస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కే సత్యనారాయణ విద్యార్థినికి ప్రశంసా పత్రం మెమొంటో అందజేశారు.జిల్లా ఫోరం అధ్యక్షులు యు.లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మణ్ కోశాధికారి ఎ. వెంకటేశం చౌటుప్పల్ ఫోరం ఇంచార్జీ మారగోని బాబు మరియు ప్రధానోపాధ్యాయులు ఎస్.దుర్గయ్య అభినందించుతూ భవిష్యత్తో విద్యార్థులందరు పాఠశాల అభివృద్ధి కొరకు పాటుపడాలని కొనియాడారు. పాఠశాలలో చదువుతున్న మన విద్యార్థులు క్రమశిక్షణ పద్ధతిని కలిగిఉన్నారని సమాజం గొప్పగా చెప్పుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థిని అభివృద్ధికి కృషి చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎన్.దేవకమ్మ, మారగోని బాబు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు బీ–ఫారమ్‌ల పంపిణీ

- తాండూర్ మున్సిపల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం
- తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**విశాలభారతి, తాండూరు:** బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి గారు గురువారం తన నివాసంలో బీ-ఫారమ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు అభివృద్ధికి నిజాయితీగా పనిచేసే నాయకులను పార్టీ గుర్తించి అభ్యర్థులుగా అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహనతో అభ్యర్థులు ముందుకు సాగాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీపై ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేసిన పైలట్ రోహిత్ రెడ్డి తాండూరు మున్సిపాలిటీలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్కులు, ప్రజా స్థలాల కబ్జాపై ప్రజావాణిలో ఫిర్యాదు




**రాజేంద్రనగర్, విశాలభారతి :** నర్సింగ్ సర్కిల్ పరిధిలోని మణికొండ సచివాలయ ఉద్యోగుల కాలనీ లేఔట్‌లో పార్కులు, ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని వైఎస్ఆర్ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ కాలనీ ప్రతినిధులు ఐడియా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలో 2236 గజాలు, 1163 గజాల విస్తీర్ణంలో ఉన్న ప్రజా ఉపయోగ స్థలాలను కబ్జాల నుంచి కాపాడాలని వారు అధికారులను కోరారు. అదేవిధంగా వర్క్స్ ల్యాండ్‌గా పేర్కొంటున్న భూములు కూడా అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో గతంలో తాము చేసిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర నగర్ - వైఎస్ఆర్ కాలనీలను కలుపుతూ 60 అడుగుల రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చిన హైడ్రా అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బైరాగిగూడలో రోడ్డు అక్రమణ బండ్లగూడ జాగిర్ పరిధిలోని గంధం గూడ, బైరాగిగూడ ప్రాంతంలోని గ్రీన్ పార్క్ కాలనీలో హైదర్ షాకోట్ - బైరాగిగూడ ప్రధాన రహదారిపై అక్రమణలు జరిగాయని కాలనీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మొత్తం 30 అడుగుల వెడల్పు ఉన్న రహదారిని ఒక్క స్థలం యజమాని 12 అడుగులకుపైగా ఆక్రమించడంతో రహదారి కుంచించుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సత్వరమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఉపాధ్యాయ సంఘాల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం, విశాలభారతి:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐజెసిటిఓ ఆల్ ఇండియా జాక్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశంలోని ఉపాధ్యాయ సంఘాలు చేయనున్న ధర్నా వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఖమ్మంలోని పిఆర్‌టియు కార్యాలయంలో ఈ పోస్టర్‌ను ఏఐఎఫ్‌టిఓ జాతీయ ఉపాధ్యక్షులు చిత్తలూరు ప్రసాద్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, మాజీ అధ్యక్షులు వై వి, నాయకులు రాయల నరసింహారావు, తాళ్లూరు చంద్రశేఖర్, లింగం సతీష్, గుర్రం కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## చింతల మహేశ్వరి సాయిలు ఏకగ్రీవ ఎన్నిక

- **17వ వార్డులో అంబరాలు అంటినా సంబరాలు**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ పరిధిలోని 17 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చింతల ఉమామహేశ్వరి సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వార్డులో అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహిస్తున్నారు. చింతల ఉమామహేశ్వరి సాయిలు నివాసానికి వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసే మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా చింతల ఉమామహేశ్వరి సాయిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులు, స్థానిక నాయకుల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని తెలిపారు.

## కోదాడ 31వ వార్డులో ఎర్నేని కుసుమ బాబు ఏకగ్రీవం



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మున్సిపాలిటీ లో కాంగ్రెస్ బోణీ కొట్టింది. స్థానిక 31వ వార్డు నుండి కోదాడ మాజీ సర్పంచ్ యెర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు కాంగ్రెస్ పార్టీ పక్షాన నామినేషన్ వేశారు. గత మూడు రోజులుగా వార్డులో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణలో కుసుమ బాబు పై పోటీలో ఉన్నవారు తమ నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో కుసుమ బాబు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఏక గ్రీవం కు సహకరించిన మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లకు, పోటీ నుండి ఉప సంహరించుకున్న అభ్యర్థులకు స్థానిక నాయకులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. తప్పకుండా వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తానన్నారు. ఏక గ్రీవంగా ఎన్నికైన కుసుమ బాబు, మాజీ సర్పంచ్ యెర్నేని బాబులకు స్థానిక నాయకులు, కార్య కర్తలు అభినందనలు తెలిపారు.

## ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు సిపిఐ మద్దతు



**మరిపెడ, విశాలభారతి:** కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి సిపిఐ కార్యకర్త కృషి చేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ రామచంద్రు నాయక ్ మాట్లాడుతూ. గత పార్లమెంటు, శాసనసభ ఎన్నికలలో నియంతృత్వ బిఆర్ఎస్ పాలనకు చలమగీతం పాడటంలో తోడ్పాటు నందించిన సిపిఐ, ఈ మున్సిపల్ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించడం హర్షణీయమని, వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని అన్నారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మరిపెడ పురపాలక ఎన్నికలలో సిపిఐ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బిఆర్ఎస్ పార్టీకి ఎన్నికలలో ఓటు అడిగే నైతిక హక్కు లేదని, ప్రజాధనాన్ని పదేళ్లపాటు లూటీ చేసిన బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు పెద్ద ఎత్తున ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆయిలు మల్లు, యం డి అఫ్జల్, సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ , సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, పోలేపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్‌లో టైల్స్ వర్కర్ అదృశ్యం

- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం - ఇన్స్పెక్టర్ నాగరాజు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్‌నగర్ పరిధిలోని జల్లా యాదవ నగర్ కాలనీకి చెందిన షేక్ దాదా పీర్ అదృశ్యమైన ఘటన స్థానికంగా కలంకలం రేపింది. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తేదీ 31 012026 రాత్రి హయత్‌నగర్ బస్ స్టాండ్ సమీపంలో షేక్ దాదా పీర్ చివరిసారిగా కనిపించినట్లు సమాచారం ఉందన్నారు. ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వివరాలు, రవాణా మార్గాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. అలాగే ఫోన్‌కు సంబంధించిన సాంకేతిక వివరాలు, ఇతర ఆధారాల ఆధారంగా విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు.ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని, ప్రజలు ఎవరైనా షేక్ దాదా పీర్‌కు సంబంధించిన సమాచారం కలిగి ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఇన్స్పెక్టర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## మహిళా, ఇద్దరు చిన్నారులు అదృశ్యం

- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న - ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్**





**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పరిధిలోనివాసం ఉంటున్న మహిళతో పాటు ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటనహయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటన పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకాష్‌నగర్ కాలనీకి చెందిన అస్మా బేగం ఆమె ఇద్దరు కుమారులు అదృశ్యమైన ఘటనపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టామని, ఆటో స్టాండ్లు, రవాణా మార్గాలు, సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కేసులో అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, ప్రజలు ఎవరైనా సంబంధిత సమాచారం కలిగి ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# సేంద్రియ, గ్రామీణ ఉపాధి యూనిట్లను పరిశీలించిన

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్,పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్**
- **పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే లక్ష్యంగా విస్తరించాలి**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** జిల్లాలో అమలవుతున్న సేంద్రియ వ్యవసాయం, కౌజు పిట్టల పెంపకం ,కొర్రమీను చేపల సాగు వంటి వినూత్న వ్యవసాయ మరియు గ్రామీణ ఉపాధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. పర్యటనలో భాగంగా పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను వారు సమగ్రంగా పరిశీలించారు. యూనిట్‌లో అమలవుతున్న సేంద్రియ విధానాలు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను సమీక్షించి తగిన సూచనలు ఇచ్చారు.రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ఈ యూనిట్ ప్రత్యేకత. యూనిట్‌లో సేంద్రియ పద్ధతిలో తయారుచేసే ఉత్పత్తుల్లో మునగాకు ఆధారిత ఉత్పత్తులు,చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు,ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, వివిధ రకాల కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సబ్బులు మొదలైన మొత్తం 102 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. గ్రామీణ వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తులను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ఈ యూనిట్ ప్రత్యేకత. పరిశుభ్రత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సమర్థవంతమైన మార్కెటింగ్ విధానాల వల్ల కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం స్థానిక మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయి. పక్షులకు అందించే ఆహార దాణా, గాలి ప్రసరణ, షెడ్ నిర్వహణ, పరిశుభ్రత చర్యలను కూడా పరిశీలించారు.

**మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కౌజు పిట్టల పెంపకం**

దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించారు. గుడ్ల ఉత్పత్తి, గుడ్లను పొదిగించడం, పిల్లల పెంపకం వంటి ప్రక్రియలను యూనిట్ నిర్వాహకులు వివరించారు. జిల్లా కలెక్టర్, రాబోయే రోజుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నాబార్డ్ ద్వారా ఆర్థిక సహాయం పొందేలా సూచించారు. లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువ రైతు చాపా బాలకృష్ణ ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలకృష్ణ, రసాయన ఎరువులు లేదా క్రిమి సంహారక మందులు వినియోగించకుండా, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి సహజ పద్ధతుల ద్వారా మంచి దిగుబడి సాధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గుర్తించారు. అలాగే, సమీకృత ప్రకృతి వ్యవసాయం చేపట్టే విధంగా స్థానిక ఏ.పి.యం కు సూచనలు చేశారు.జిల్లాలో అమలవుతున్న ఈ సేంద్రియ వ్యవసాయం, పశుపక్షి పెంపకం, మత్స్య సాగు కార్యక్రమాలు రైతులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామీణ యువతకు స్థిర ఆదాయ మార్గాలను కల్పిస్తున్నాయి అని జిల్లా కలెక్టర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ఈ విధానాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పంచులు, మహిళలు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనుమతి లేని డ్రోన్‌లు,డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు

- **పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**విశాలభారతి, గోదావరిఖని:** సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ,ఈ పరిస్థితులకు కళ్లెం వేసి ప్రజల భద్రతను పరిరక్షించేందుకు నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01022026నుండి 01032026 వరకు అమలులో ఉంటాయని, పరిస్థితులను బట్టి ఈ కాలపరిమితిని మరింత పొడిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.డీజే, డ్రోన్‌లపై నిషేధాజ్ఞల పొడగింపు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ,ప్రదర్శనల కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నారని, అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఏ ప్రాంతంలో ఎంత స్థాయిలో మైక్ సెట్ వినియోగించాలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు.

## మియాపూర్ లో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** నగర రహదారుల పై పెరుగుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనలను నియంత్రించి, రోడ్డు భద్రతను మరింత పెంచే దిశగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.మియాపూర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ పర్యవేక్షణ లో ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. పర్యవేక్షణలో ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగాయి.ముఖ్యంగా తప్పు దిశలో (రాంగ్ సైడ్) వాహనాలు నడిపే వాహనదారుల_పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారి పై తప్పు దిశలో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో,అటువంటి ఉల్లంఘనల పై కఠినంగా వ్యవహరించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులను అక్కడికక్కడే ఆపి, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ చట్ట నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి కేసులను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.రోడ్డు భద్రత పై ప్రజల్లో బాధ్యతా భావం పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, తప్పు దిశలో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో డ్రైవ్లు కొనసాగుతాయని, ఉల్లంఘనలకు పాల్పడితే మరింత కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు హరిశంకర్, విఠల్ రెడ్డి, పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలం చందానగర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి మండల పశువైద్య అధికారి డా. అహ్మద్ నేతృత్వం వహించారు. ఈ శిబిరంలో ఎదకు వచ్చిన పాడి పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయగా, ఎదకు రాని పశువులకు అవసరమైన చికిత్సలు అందించారు. అలాగే గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న 59 పశువులకు వైద్య సేవలు అందించారు. లేగదూడలు మరియు దుడ్డేలకు 19 మందికి నట్టల నివారణ మందులు త్రాగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీ మురళీ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ, ఇలాంటి పశు వైద్య శిబిరాలను గ్రామ రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమ్మరి రాజు, వార్డు మెంబర్లు, మొయినాబాద్ మండల పశువైద్య అధికారి డా. అహ్మద్, అందాపూర్ పశువైద్య అధికారి డా. దేవి రెడ్డి, రంగారెడ్డి పశుగణాభివృద్ధి సంస్థ డా. శ్రీకర్ రెడ్డి, గోపాల మిత్ర సూపర్‌వైజర్ వెంకటేష్, గోపాల మిత్రులు యాదయ్య, శ్రీను, పశు వైద్య సిబ్బంది ప్రసన్న కుమార్,భీమ్ రావ్‌తో పాటు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## ఇన్చార్జ్ ఎంపీడీవోగా ముత్యాలరావు బాధ్యతలు



**అశ్వాపురం, విశాలభారతి:** మండల ఇంచార్జి ఎంపీడీవో గా ఎంపీఓ ముత్యాలరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ కు మున్సిపల్ ఎన్నికల విధులు అప్పగించడంతో ఎంపీఓ ముత్యాలరావుకు బాధ్యతలను అప్పగించారు.

## రాజ్యాధికార పార్టీ మహిళా కమిటీ ఎన్నిక



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని చవిటిగూడెం గ్రామంలో మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నూతన మహిళా కమిటీలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు విలాసాగరపు కోటేశ్వరరావు నేతృత్వంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బయ్య లింగమ్మ, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మి, ప్రధాన కార్యదర్శి హైమావతినీ ఎన్నుకున్నారు. తొలుత అధ్యక్షుడు వారిని పార్టీలోకి ఆహ్వానించి వారికి పార్టీ కండువాలను కప్పారు. అనంతరం నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ మండలంలో కూలీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తామన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న దినసరి కూలీలకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికుల శ్రమను దోచుకుని తక్కువ వేతనాలు ఇస్తే ఉద్యమం తప్పదన్నారు.

## నేడు ఈ ప్రాంతాల్లో విద్యుత్ కట్



**ముషీరాబాద్,విశాల భారతి:** విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ నిర్మాణ పనుల నేపథ్యంలో బుధవారం పలుచోట్ల విద్యుత్ సరాపరలో అంతరాయం ఏర్పడుతుందని అజమాబాద్ ఏ డి ఈ జి నాగేశ్వరరావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హరాజ్ పెంట, కమేల, మౌలానా ఆజాద్ నగర్, చప్పల్ బజార్ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సీసీ ష్రాఫ్, కాచిగూడ ఎక్స్ రోడ్, నెహ్రూ నగర్, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సప్లై ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసమే ఈ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## కరాటే పోటీల్లో డీపీఎస్ విద్యార్థుల ప్రతిభ వెల్లువ




**మహబూబాబాద్ విశాలభారతి:** ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఓపెన్ కరాటే పోటీల్లో మహబూబాబాద్ జిల్లా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. వివిధ వయస్సు, బరువు విభాగాల్లో పాల్గొన్న డీపీఎస్ విద్యార్థులు కఠినమైన పోటీలను ధైర్యంగా ఎదుర్కొని తమ కరాటే నైపుణ్యాన్ని చాటారు. శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ఆటతీరు ప్రదర్శించిన విద్యార్థులు మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. పోటీల్లో వారి ప్రతిభను గమనించిన నిర్వాహకులు డీపీఎస్ విద్యార్థుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విజయానికి కరాటే కోచ్‌ల సమర్థమైన మార్గనిర్దేశం, పాఠశాల యాజమాన్యం అందించిన నిరంతర ప్రోత్సాహమే ప్రధాన కారణమని నిర్వాహకులు తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హాత్ బాను, ఉపాధ్యాయ బృందం హృదయపూర్వకంగా అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరింత ఉన్నత విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించిన శ్యాం ప్రసాద్ లాల్ ఐఏఎస్



**మరిపెడ, విశాలభారతి:** జిల్లా వ్యాప్తంగా (5) మున్సిపల్ పరిధిలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, డోర్నకల్, మరిపెడలలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియన ఏర్పాట్లను మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, సెంట్ అగస్టిన్ హై స్కూల్ కౌంటింగ్ కేంద్రం ను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అధికారులు పక్కాగా సౌకర్యాలను కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం ముగిసే వరకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు త్రాగునీరు, చైర్స్, టెంట్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య బృందం ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు, పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలించే క్రమంలో రిటర్నింగ్ అధికారులు పోలీస్ భద్రతా సిబ్బంది మధ్య పోలింగ్ బాక్సులు తరలించాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార ముందస్తు అనుమతులు, ఖర్చుల వివరాలు, తదితర అనుమతులను సమయం లోగా తీసుకునే విధంగా అభ్యర్థులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.

## మహిళా అదృశ్యం



**మేడిపల్లి, విశాలభారతి:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... అబ్దుల్ కలీం భార్య షాహినా బేగం 40 భర్తతో కలిసి పీర్జాదిగూడ రాధాకృష్ణ కాలనీలో ఉంటున్నారు. జనవరి 31 న మధ్యాహ్నం ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభించలేదు ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే 'కల్కి 2', 'సలార్ 2'. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్... వాటి తర్వాత 'కల్కి 2'ను మొదలు పెట్టి, ఆపై 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే 'సలార్ 2' పట్టాలెక్కే అవకాశం ఉంది.ఎన్టీఆర్ – కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'దేవర 2' స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. 'జాంబిరెడ్డి 2', 'జై హనుమాన్', 'మిరాయ్ 2' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'జై హనుమాన్'లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది.చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Madarapu Ashok. RNI No APTEL/2010/32877.